VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 16 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 66

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా?

### భక్తజన సంద్రం ఖైరతాబాద్

# మహాగణపతి



హైదరాబాద్ : ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో భారీగా భక్తులు పోటెత్తారు. శనివారం కంటే ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. దీంతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాలు కిక్కిరిసి పోయి కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. భక్తులు త్వరగా వినాయకుడిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం భక్తుల దర్శనాలకు అనుమతులు నిలిపివేసి నిమజ్జనానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేయనున్నారు.



"మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సెమీఫైనల్స్ మాత్రమే.. 2029లో ఫైనల్స్ ఉన్నాయి... వాటిలో విజయం సాధించి ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగరేయాలి. రాహుల్ గాంధీని ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్ గెలిచినట్లు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# మా జోలికొస్తే ఊరుకోం

### 2029లో రాహుల్‌ను ప్రధానిని చేస్తాం
### గత ఎన్నికలు సెమీఫైనల్స్ మాత్రమే
### కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరి జోలికీ పోరు
### మా మంచితనాన్ని చేతకానితనంగా తీసుకోవద్దు
### బీసీ కులగణన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు
### రాబోయే పంట నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్
### పీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సభలో సీఎం రేవంత్

హైదరాబాద్: 2029లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 స్థానాలు కాంగ్రెస్ సాధిస్తేనే ఫైనల్స్ గెలిచినట్టని.. అప్పటివరకు పార్టీ శ్రేణులెవరూ విశ్రమించొద్దని పిలుపు నిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "2004, 2009లో కాంగ్రెస్, 2014, 2018లో భారాస నెగ్గాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ రెండోసారి గెలిచి పదేళ్ల పాటు నిరంతరాయంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. నిన్న, మొన్న వారొకరు, వీరొకరు మోపయ్యారు. వాళ్లో, వాళ్ల అనుచరులో మన కార్యకర్తలపై కేసులు పెట్టాలనో.. దాడులు చేస్తామనో ప్రయత్నం చేస్తున్నారు. మనింటికి వస్తామని చెప్పారు. కానీ మనోళ్లే వాళ్లింటికి పోయారు. అంతా అయ్యాక చెపుతున్నారు తన్నారని... మా కార్యకర్తలను రా చూద్దాం అని ఎందుకు పిలిచారు..? శాంతిభద్రతలను కాపాడాలని నేను పోలీసులకు చెప్పాను. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరి జోలికీ పోరు.. వారి జోలికి ఎవరైనా వస్తే ఊరుకునేది లేదు. మా మంచితనాన్ని - మిగతా 2వ పేజీలో



## మహేశ్‌కుమార్ గౌడ్‌పై
## పూర్తి విశ్వాసం ఉంది

పీసీసీ అధ్యక్షుడిగా సౌమ్యుడు మహేశ్‌కుమార్ గౌడ్ వచ్చారు. నాకు ఆయనపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మహేశ్ వెనుక నేనున్నాను. ఇప్పటివరకూ జరిగిన ఎన్నికలు నాయకులకు సంబంధించినవి. పార్టీ అధ్యక్షుడిగా పూర్తి సమయాన్ని కేటాయించే వారిని నియమించాలని సోనియాకు చెప్పాను. బలహీన వర్గాలకు సముచిత స్థానం ఇవ్వాలని మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా ఖర్గే, సోనియా నియమించారు. ప్రభుత్వ కార్యక్రమాలను పీసీసీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇకనుంచి జరగబోయే సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జడ్పీ ఎన్నికలు కార్యకర్తలకు సంబంధించినవి. వారిని గెలిపించడానికి పీసీసీతో సమన్వయంతో పనిచేస్తాం. నేతలందరం స్థానిక ఎన్నికల కోసం ఎక్కువగా కష్టపడతాం. రాబోయే మూడు నాలుగు నెలల్లో బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం. వాటిలో కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత మా నాయకులపై ఉంది.

# ఒక్కసారే ఎక్కువ.. రెండోసారి పగటి కలే..



### రైతు రుణమాఫీపై అన్నీ అబద్ధాలే
### నేను పొడుగున్న అంటున్నావ్..
### నిన్ను లిల్లీపుట్ అనాలా?..
### సీఎం అబద్ధాల బురదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
### రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్: 'కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుడే ఎక్కువ.. రెండుసార్లు గెలుస్తారని అనుడం పగటి కలలు కనడుమే' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఐదేళ్లలోపు ప్రభుత్వాలు పోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లా డుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. 'అదృష్టం బాగుంటే ఐదేళ్లు ఉంటావు.మంచిగా ప్రవర్తించు. ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ఒక్కసారికే పోతుంది. రెండుసార్లు అధికారంలో ఉంటానని పగటి కలలు కనకు. అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి ముఖ్యమంత్రి పదవి ఇజ్జత్ తీస్తున్నావు. సీఎం కుర్చీ గౌరవం తగ్గిస్తున్నావు. రాష్ట్రంలో రెండు రకాల వరదలతో ప్రజలు

తిప్పలు పడుతున్నారు. ఒకటి వర్షాలతో వచ్చిన వరద అయితే...రెండోది చిల్లర ముఖ్యమంత్రి అబద్ధాల వరద. మోరీల కంపును మించిపోయింది ముఖ్యమంత్రి నోటి కంపు. ప్రభుత్వంలో ఉన్నాననే సోయి..ముఖ్యమంత్రి కుర్చీ మీద కూర్చున్నా అనే ఇంగితం లేక మాట్లాడుతున్నాడు.పదే పదే నా పొడుగును గురించి దుర్భాషలాడుతున్నావు. నేను పొడుగే. తెలంగాణ ఉద్యమం నన్ను మరింత ఎత్తుకు చేర్చింది. నీ బుద్ధి కురుచ. నీ చరిత్ర కురుచ. నీ భాష కురుచ. నీ కురుచతనం వల్ల నీకు కలిగిన ఆత్మనూన్యత వల్ల పదేపదే నా పొడుగు గురించి మాట్లాడుతున్నావు.



2లో

## నిమజ్జనానికి
## 2,500 వాహనాలు



2లో

## వారంలో పాలేరు ప్రధాన కాలువ మరమ్మతులు పూర్తి

వేగుచుక్క
TELUGU DAILY NEWS





## నిమజ్జనానికి 2,500 వాహనాలు



హైదరాబాద్: గణపతి నిమజ్జన మహోత్సవానికి వాహనాలను అందజేసేందుకు ఆర్టీఏ చర్యలు చేపట్టింది. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి మండపాలకు అవసరమైన వాహనాలను అందజేసేందుకు రవాణా అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన మండపాల నిర్వాహకుల నుంచే వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా వాహనాలను ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 17న నిమజ్జన వేడుకలు జరగనున్న నేపథ్యంలో 16వ తేదీ సోమవారమే వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు. సుమారు 2,500 వాహనాలను సిద్ధం చేయనున్నారు.

### రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి

# రాజీనామా?

- ఈ ఉదయం పార్టీ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన కేజ్రీవాల్
- పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు
- హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ప్రచారంపై పార్టీ నేతలతో చర్చ
- ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతానని, తాను నిజాయతీపరుడినైతే ఓట్లు వేస్తారన్న కేజ్రీవాల్



ఢిల్లీ :మరో రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎంగా ఉండనని అన్నారు. అందుకే ప్రజాతీర్పు కోరతామని స్పష్టం చేశారు. నేను నిర్దోషినని నమ్మితే భారీగా ఓట్లు వేయండి అని ప్రజలకు పిలుపునిచ్చారు. తనను జైలుకు పంపి, ఆప్ లో చీలికలు తీసుకురావాలని ప్రయత్నించారని, తద్వారా ఢిల్లీ పీఠం చేజిక్కించుకోవాలని భావించారని వివరించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఆప్ ను విచ్ఛిన్నం చేయలేకపోయారని తెలిపారు. జైలు నుంచి కూడా ప్రభుత్వాన్ని నడపవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు నిరూపించాయని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే ఇన్నాళ్లూ రాజీనామా చేయలేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మహారాష్ట్రతో పాటు ఢిల్లీకి కూడా ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి దాదాపు ఆరు నెలల పాటు జైలులో ఉన్న ఆయన తాజాగా బెయిలుపై బయటకు వచ్చారు. ఈ ఉదయం ఆయన తొలిసారి పార్టీ కొత్త హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యల పట్ల పార్టీలో అంతర్గతంగా చర్చ బయలుదేరడంతో ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా కేజ్రీవాలే ఉండాలని పార్టీలో ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అయితే, కేజ్రీవాల్ వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటంటే... నవంబరులో ఎన్నికలకు వెళ్లి సత్తా నిరూపించుకోవాలని ఆయన భావిస్తున్నారని భరద్వాజ్ వివరించారు. ప్రజలు కేజ్రీవాల్ నిజాయతీపరుడు అని గుర్తిస్తే ఆప్ ఎన్నికల్లో గెలుస్తుందని, కేజ్రీవాల్ మరోసారి సీఎం అవుతారని స్పష్టం చేశారు.అంతకుముందు కేజ్రీవాల్ కార్యకర్తల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ప్రజల్లోకి వెళ్లి ఓటు వేయమని అడుగుతాను. నేను నిజాయతీపరుడిని అనుకుంటే ప్రజల నాకు ఓటేస్తారు. అప్పుడు నేను సీఎం సీటులో కూర్చుంటా. లేదంటే లేదు" అని కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మరో రెండ్రోజుల్లో సీఎం పదవికి తాను రాజీనామా చేస్తానని

, తర్వాత పార్టీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తుందని, ఆ తర్వాత సీఎం పేరును నిర్ణయిస్తుందని కేజ్రీవాల్ వివరించారు.

# మా జోలికొస్తే ఊరుకోం



చేతకానితనం అనుకుంటే సహించేది లేదని చెప్పదలుచుకున్నా. హరీశ్‌రావు ఎక్కడ?

ఇచ్చిన మాట ప్రకారం 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లను వేసి వారి కళ్లల్లో ఆనందాన్ని చూశాం. రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు ఎక్కడ? నేను రుణమాఫీ చేసిన రైతుల వివరాలు పంపిస్తా. ఆయన రాజీనామా చేయాలి. రూ.2 లక్షలకు పైగా బాకీ ఉన్న రైతులు పైనున్న సొమ్మును వెంటనే బ్యాంకులో చెల్లిస్తే ప్రభుత్వం మాఫీ చేస్తుంది. వచ్చే పంట నుంచి సన్నవడ్లకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి ఆదుకునే ప్రభుత్వం మాది.

మరో 35 వేల కొలువులు

ఈ ఏడాది ఆఖరులోగా మరో 35 వేల ఉద్యోగాలు ఇస్తాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోగా 65 వేల ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వం మాది తప్ప దేశంలో ఇంకొకటి లేదు. 35 వేల మంది టీచర్లను బదిలీ చేసి 19 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చిన ఘనత మా సర్కారుది. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశానికి ఒక్క బంగారు పతకం కూడా రాలేదంటే దేశానికి అవమానం కాదా అని మోదీని అడుగుతున్నా. తెలంగాణ రాష్ట్రమంత ఉన్న దక్షిణ కొరియా 16 పతకాలు సాధించింది. తెలంగాణలో కూడా ఇలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేసి 2028 ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తాం. హైదరాబాద్ విమానాశ్రయాన్ని వై.ఎస్. నిర్మిస్తే నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. దీన్ని విశ్వనగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. సైబరాబాద్‌ను చంద్రబాబు, వై.ఎస్.లు నిర్మించారు. అధునాతన ఫ్యూచర్ సిటీ నిర్మించే బాధ్యతను మేం తీసుకున్నాం.

అధికారంలోకి రాగానే రెండు గ్యారంటీల అమలు

మేం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మొదటి రెండు గ్యారంటీలను అమలు చేశాం. ఇప్పటివరకు 85 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచి పేదలకు వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ పేదల ఇళ్లలో వెలుగులు నింపుతున్నాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించి మహిళలను ఆదుకుంటున్నాం. ఇచ్చిన మాట ప్రకారం పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూశాం. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల పాదయాత్రలో చెప్పాం. వాళ్ల ఉద్యోగాలు ఊడగొట్టి మాకు అధికారం ఇచ్చిన మూణ్నెల్లలోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం.


# వారంలో పాలేరు ప్రధాన కాలువ మరమ్మతులు పూర్తి



సూర్యాపేట :అకాల వర్షాలు, వరదలకు రాష్ట్రంలో తెగిన కాలువలు, చెరువుల పునరుద్ధరణ వేగవంతంగా జరుగుతోందని, వాటి కింద ఒక్క ఎకరా కూడా ఎండిపోనివ్వబోమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ సభ్యులు క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారన్నారు. నాగార్జునసాగర్ నుంచి ఖమ్మం జిల్లా పాలేరు జలాశయానికి వెళ్లే ఎడమ ప్రధాన కాలువ, బ్రాంచి కాలువలు పలు చోట్ల తెగిపోగా.. నీటిపారుదల శాఖ వాటి మరమ్మతులను ప్రారంభించింది. ఆ పనుల్లో వేగం పెంచేందుకు మంత్రి ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన సూర్యాపేట జిల్లా నడిగూడెం, హుజూర్‌నగర్, చిల్కూరు మండలాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పనుల వద్ద, హెలికాప్టర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "రాష్ట్రంలో గత నెల 31 నుంచి సెప్టెంబరు 2 వరకు భారీ వరదలు పోటెత్తాయి. వివిధ జిల్లాల్లో మునుపెన్నడూ లేనంత నష్టం చోటుచేసుకుంది. పాలేరు జలాశయ మట్టం అమాంతం పెరిగింది. ఎడమ ప్రధాన కాలువ నీటి సామర్థ్యం 96,795 క్యూసెక్కులైతే ఒక్కసారిగా 1.97 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ఈ కాలువ రెండు చోట్ల కొట్టుకుపోయింది. నడిగూడెం మండలం కాగితం రామచంద్రాపురం సమీపంలో 132 కి.మీ. వద్ద కట్ట తెగింది. కాలువలో బెడ్, లైనింగ్ తీవ్రంగా దెబ్బతింది. కట్టపై నుంచి నీళ్లు పొర్లి భారీగా కోతకు గురైంది. పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది. వీటి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు చేశాం. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోనూ 133.5 కి.మీ. వద్ద గండిపడింది. ఈ కాలువ తెగిపోవడంతో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు నిలిచిపోయింది. వారంలో పనులను పూర్తిచేస్తాం. ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా కాపాడతాం. హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం సమీపంలోని ముక్త్యాల బ్రాంచి కాలువ కింద వివిధ మండలాల్లో లక్ష ఎకరాలవరకు ఆయకట్టు ఉంది. ఈ కాలువకు పడిన గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.

# జిఎస్టీపై తలబిరుసు సమాధానం !

జిఎస్టీ ద్వారా జీవితాలు అతలాకుతలం అవుతున్నా..మోడీ ప్రభుత్వం కించిత్ కూడా పాశ్చాత్తాపం చెందడం లేదు. స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రస్తావించిన తరవాత పార్లమెంటులో పలువురు సభ్యులు దీనిని ప్రస్తావించారు. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన సమాధానం చూస్తే షాక్ కావాల్సిందే. ఆమె సమాధానం తలబిరుసుతో ఉన్నట్లుగా ఉంది. జీవిత, ఆరోగ్య బీమాపాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలంటూ డిమాండ్లు ఊపందుకున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించిన తీరు చూశాక..మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను ప్రస్తావించడ మే తప్పన్న రీతిలో ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై చర్చించేది లేదన్న ట్లుగా మోడీ బృందం తీరు ఉంది. జిఎస్టీ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమెకు తొలుత లేఖ రాయగా.. తాజాగా ఇండియా కూటమి సభ్యులు లోక్‌సభ వేదికగా బీమాపై జీఎస్టీ తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో లోక్‌సభలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ విధానం అమల్లోకి రాకముందు కూడా బీమా ప్రీమియంలపై పన్ను వసూలు అయ్యేదని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఇదేమీ కొత్త విషయం కాదని, అన్ని రాష్ట్రాల్లో ఇది అమలైందని పేర్కొన్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాకా అదే విధానం కొనసాగిందన్నారు. ఇలా వసూలైన జీఎస్టీలో 75 శాతం రాష్ట్రాలకే వెళుతోందని పేర్కొన్నారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న వారు ఎప్పుడైనా తమ రాష్ట్రాల్లో దీనిపై చర్చించారా అని ఎదురు ప్రశ్నించారు. ఒకరు లేవనెత్తిన అంశంపై ఏకంగా 200 మంది ఎంపీలు పార్లమెంట్ వేదికగా అదే పల్లవి అందుకున్నారని ఎద్దేవా చేశారు. అంటే గడ్కరీ లేవనెత్తిన అంశంపై అంటూ...ఎకసక్కెంగా మాట్లాడారు. అంతేగాకుండా లోక్‌సభలో నిర్మలా సీతరామన్ లాగా సమాధానం చెబితే...ప్రజలు మెచ్చరని గుర్తించాలి. పార్లమెంటులో బిజెపి, ఎన్‌డిఎ కూటమి సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా చప్పట్లు కొట్టడం మరింత దారుణంగా చూడాలి. నిజంగా ఈ అంశంపై విపక్షాలు గట్టిగా నిలబడి కొట్లాడాల్సిందే. జిఎస్టీ వల్ల జరుగుతున్న నష్టాలను, అనర్థాలను చర్చించాల్సిందే. కానీ విపక్షాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మొత్తంగా మోడీ తాను తెచ్చిన జిఎస్టీకి మూడే కొమ్ములు అన్న చందంగా తలబిరుసుగా,నిరంకుశంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తే ..అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభలో కొట్లాడుతున్నాయన్న భావనలో మోడీ బృందం ఉంది. ఈ అంశం అధికార బిజెపికి, ఇండియా కూటమికి మధ్య ఉన్న సమస్య కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గుర్తించటనట్లుగా లేదు. ఇది కోట్లాదిమంది భారతీయులు ఎదుర్కొంటున్న సమస్య. గత పదేళు ్లగా మోడీ ఏ అంశంపైనా చర్చించడం లేదు. పక్కనున్న బంగ్లాలో రిజర్వేషన్ల చిచ్చు.. ఆ దేశ ప్రధానిని పారిపోయేలా చేసింది. ఇలాంటి సమయంలో కూడా ఇక్కడ సమస్యల ను ప్రస్తావిస్తే చర్చ చేయకుండా పొగరుగా సమాధానం ఇవ్వడం సరికాదు. నిజంగా జిఎస్టీ కావచ్చు.. మరేదైనా సమస్య కావచ్చు...మోడీ ఈ మధ్య మాట్లాడడం లేదు. దేశంలో ఎంతగా ఆందోళన వ్యక్తం అవుతున్నా పట్టించుకోవడం లేదు. మోడీ అధికారంలోకి రాకముందు మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ పలు సందర్భాల్లో విమర్శించారు. ఇప్పుడు అదే మోడీ మౌనిగా మారారు. తాను చేయదల్చు కున్నది చేస్తున్నారు. చెప్పదల్చుకున్నదే మాట్లాడుతున్నారు. పార్లమెంట్ జరుగుతున్నా హాజరు కావడం లేదు. ప్రజల సమస్యలు ప్రస్తావనకు వచ్చినా పట్టించుకోవడం లేదు. మన్మోహన్‌ను నిందించిన మోడీ తాను చేస్తున్నదేమిటో గుర్తించడం లేదు. వైఫల్యాలను బీజేపీ అంగీకరించ వలసిన సమయం ఇక ఆసన్నమైంది. పార్లమెంటులో మాట్లాడరాదనే మౌనవ్రతాన్ని ప్రధాని మోదీ చేపట్టారని గతంలో అనేకమార్లు విపక్షాలు విమర్శించాయి. నితిన్ గడ్కరీ బిజెపిలోనూ, మంత్రివర్గంలోనూ ఎంతో సీనియర్ నేత. బిజెపి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. అలాంటి కేంద్రమంత్రి ప్రస్తావించిన జిఎస్టీ అంశాన్ని చర్చించాల్సిన అసవరం ఉంది. విపక్షాలు కూడా గాలివాటంగా జిఎస్టీ ఎత్తేయాలని కోరడం లేదు. బీమాపైనా, చేనేతలపైనా జిఎస్టీ ఎత్తేయాలని కోరుతున్నారు. తాజాగా చేనేతపై జిఎస్టీ ఎత్తేసేందుకు కేంద్రంతో మాట్లాడుతానని ఎపి సిఎం చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు. అంటే పన్నులు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించే ఆయన ఈ మాట అన్నారని భావించాలి. నిజానికి పార్లమెంటులో చర్చలో పాల్గొని ప్రస్తావించే ప్రతి ఒక్కరి ప్రసంగంలోని విషయాలను సానుకూలంగా తీసుకోవాలి. వాటికి సానుకూల వైఖరితోనే సమాధానం చెప్పాలి. ప్రజలకు భరోసా కల్పించాలి.కానీ మోడీకి అలాంటి ఉద్దేశ్యం లేదని మరోమారు స్పష్టమయ్యింది. ప్రజలు నేరుగా పార్లమెంటుకు వచ్చి ప్రశ్నలు అడగరు. ఎవరో ఒక ఎంపి ద్వారా ప్రశ్నలు అడుగుతారు. పత్రికల ద్వారా సమాచారం చేరవేస్తారు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు వివిధ వేదికల ద్వారా చర్చకు పెడతారు. కానీ నిర్మలా సీతారామన్ దీనిపై ఆలోచిద్దామని చెప్పకుండా పెడసరంగా..ఇది ఇలాగే ఉంటుందని సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు. నిజానికి ప్రజలు ఇలాంటి సమాధానం కోరుకోవడం లేదు. జిఎస్టీ వడ్డింపులు తగ్గించబోమని చెప్పడానికి కారణాలు ఏమిటో చెప్పాలి. ఎందుకు తగ్గించరో చెప్పాలని కోరుకుంటున్నారు. ఇలాంటి సమాధానాల ద్వారా దేశానికి ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం తేలిపోయిన తరవాత జనానికి మరోమారు మోడీపై విశ్వాసం పోవడం ఖాయం. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న జిఎస్టీ వడ్డింపులపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. కానీ ఎలాంటి జవాబుదారీ వహించక పోవడం దారుణం కాక మరోటి కాదు. ప్రజలను పట్టిపీడిస్తున్న పన్నులు వ్యవస్థను సంస్కరించాల్సిందే. తుమ్మినా దగ్గినా జిఎస్టీ అంటే ప్రజలు బతికేదెలా అని ఆలోచించాలి. దీనిపై ఎసి గదుల్లో కొందరు చర్చించకుండా గ్రామాలకు వచ్చి చర్చించాలి. పలు వేదికల ద్వారా చర్చ చేయాలి. అప్పుడే అసలు సంగతులు బయటకు వస్తాయి.




వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS






# సబ్జెక్టుపై అవగాహన, కృషి తోనే మంచి మార్కులు.

♦ ఎస్ఎస్ సి విద్యార్థులకు వక్తల సూచన. ♦ ప్రైవేట్ పాఠశాలల "విజయస్పూర్తి" కార్యక్రమానికి మంచి స్పందన.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, సెప్టెంబర్ 15**

: విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకొని, అన్ని విధాలుగా కృషి చేస్తే పరీక్షల్లో వంద శాతం మార్కులు సాధించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్మూర్ మండల ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయస్పూర్తి కార్యక్రమాన్ని ఆదివారం జి ఆర్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్స్ , టెక్స్ట్ బుక్ రైటర్ చక్రవర్తుల శ్రీనివాస్, శశికలాదర్, గౌస్ పాషా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు సబ్జెక్టు లోని మెలకువలు వివరించడం తో పాటు మానసికంగా దృఢంగా ఉండాలంటే మన జీవన విధానం ఏ విధంగా ఉండలో తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్ఎస్ సి విద్యార్థులు పాల్గొని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించే మెలకువలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీణ్ పవార్, ప్రోగ్రాం కన్వీనర్ లు భాశిత సుందర్, కాంతి గంగారెడ్డి, మానస గణేష్ , నలందా ప్రసాద్, కోశాధికారి స్కాలర్స్ వేణు, జెంటిల్ కిడ్స్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.





# మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణనికి తరలివెళ్లిన కల్లుడిపో కార్మికులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 15:**

రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా నిజామాబాద్ నగరం నుండి మూడో కళ్ళు డిపోకు చెందిన గీతా కార్మికులు, గౌడ కులస్తులు ఆదివారం హైదరాబాద్ కు తరలి వెళ్ళారు. జిల్లా, గౌడ కులానికి చెందిన మహేష్ గౌడ్ కు పిసిసి అధ్యక్ష పదవి రావడం చాలా గర్వంగా ఉందని, ఇది ఒక క్రమ శిక్షణ నిబద్ధత కలిగిన వ్యక్తికి లభించిన గౌరవం అని నాయకులు రాజా గౌడ్, తిరుమలేశ్వర్ గౌడ్, ఏ. శ్రీనివాస్ గౌడ్, గడ్డం లక్ష్మణ్ గౌడ్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలాగౌడ్, ఇదిగిరాల శ్రీనివాస్ గౌడ్, చిగురుపల్లి రాజ గౌడ్, రాజా గోపాల్ గౌడ్, సిరిగాద స్వామి గౌడ్, సూర్య ప్రకాష్ గౌడ్, బుర్ర రామ గౌడ్, జక్కపురం సాయగౌడ్, సుభాష్ గౌడ్, అశోక్ రాజ్ గౌడ్, పొన్నం శ్రీహరి గౌడ్, అధిపెల్లి శంకర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, సురేష్ గౌడ్, మహేందర్ గౌడ్, రాజకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మనోహర్ రెడ్డికి ఘన నివాళి.



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, సెప్టెంబర్ 15:**

పసుపు బోర్డు సాధన ఉద్యమ నాయకుడు ముత్యాల మనోహర్ రెడ్డికి పలువురు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఒక అలుపెరుగని పోరాట యోధుడు, పసుపు బోర్డు సాధన కోసం నిరంతరం పరితపించాడని అన్నారు. పసుపు బోర్డు వచ్చేంత వరకు పాదరక్షలు లేకుండా పాదయాత్ర చేసిన మహోన్నత వ్యక్తి, ఆయన ఆశ ఆశయం నెర వేరకుండానే మన మధ్య నుండి వెళ్లిపోయాడని అన్నారు. కాగితాలకే పరిమితమైన పసుపు బోర్డు నిర్మాణం జరిగినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని,పసుపు బోర్డు సాధన కోసం పోరాటం చేసి, సాధించి ఆయన కు అంకితం చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ రెడ్డి, రైతు సంఘం నాయకులు వి. ప్రభాకర్, దేవరాం తదితరులు ఉన్నారు.

# ఉద్యమాల వేగుచుక్క "పిడిఎస్ యూ"

**50 వసంతాల లోగో ఆవిష్కరణ.**

**విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయాలి.**

**పిడి ఎస్ యూ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు వి.భాస్కర్ పిలుపు.**







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 15: ఉద్యమాల వేగుచుక్క**

పిడిఎస్ యూ అర్ధ శతాబ్దం నిండిన సందర్భంగా, 50 వసంతాల లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలో నిర్వహించారు. పిడిఎస్ యూ పూర్వ, ప్రస్తుత నాయకుల చేతుల మీదుగా లోగోను ఘనంగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పిడి ఎస్ యూ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు వి.భాస్కర్ మాట్లాడుతూ, 1974 సంవత్సరంలో పిడిఎస్ యూ ఏర్పడిందని, గత 50 ఏండ్ల కాలంలో విద్య రంగ సమస్యలపైన, శాస్త్రీయ విద్యా సాధనకై, సమ సమాజ స్థాపనకై, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటికరణకు వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. 50 ఏండ్లలో జార్జ్ రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, రంగవల్లి తదితర ఎందరో విద్యార్థి వీరులు తమ ప్రాణాలను బిగిపిడికిలి జెండా కోసం అర్పించారని అన్నారు. పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని, అక్టోబర్ 24 న హైదరాబాద్, ఓయూ లో జరిగే పిడిఎస్ యూ శతాబ్దోత్సవ సభను పూర్వ , ప్రస్తుత నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ పిడిఎస్ యూ నాయకులు పరుచూరి శ్రీధర్, దాసు, పోచయ్య, పురుషోత్తం, అరుణ, ఆకుల నారాయణ, రమేష్, డాక్టర్ సరిత, అన్వేష్, రవి, ప్రస్తుత జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, నాయకులు ప్రిన్స్, రవీందర్, నిఖిల్, శివసాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# 17న విలీన దినోత్సవం జరపండి.

**- సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 15**

తెలంగాణ ప్రజలందరు సెప్టెంబర్ 17 నూ విలీన దినోత్సవంగా జరుపుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఆదివారం సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై. ఓమయ్య మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయాలని, దున్నేవానికి భూమి కావాలని, ఈ ప్రాంత ప్రజల పట్ల నిజాం నిరంకుశ వైఖరికి నిరసనగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి లక్షలాది మంది ప్రజలను నిజాం, రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసి పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పది లక్షల ఎకరాల భూమిని పంచి భూమిలేని నిరుపేదలను రైతులను చేసిన చరిత్ర సిపిఐది అన్నారు. కానీ బిజెపి నాయకులు తెలంగాణ విలీన దినోత్సవ చరిత్రను వక్రీకరించి అమరుల త్యాగాలను పక్కనపెట్టి హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నిజాం వ్యతిరేకంగా పోరాటం చేసిన దాంట్లో మగ్దూం మయినుద్దీన్, బందగి, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లతోపాటు అనేకమంది ముస్లిం మేధావులు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని జైలు పాలై అసువులు బాసారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు పి నర్సింగరావు, హనుమాన్లు, దేవేందర్, రాజశేఖర్, యూసుఫ్, రఫీక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇలా చేస్తే మీగడ ఎక్కువగా వస్తుంది..

కొన్నిసార్లు బయటి పనిని ఎంతైనా చేయగలం. కిచెన్ పని చేయడం కష్టంగా ఉంటుంది. అలాంటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. అవేంటో చూద్దాం. ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో ఏ పని అయినా త్వరగా అయిపోవాలి. అందుకోసం కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. కిచెన్‌లో పని చేసినప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అయితే, చేసేపని మరింత ఈజీగా చేయొచ్చు. త్వరగా చేసేయొచ్చు. మరి అలాంటి కిచెన్ టిప్స్ ఏంటో తెలుసుకోండి..

మసాలా స్టోర్ చేసేటప్పుడు.. మసాలా పదార్థాలను మనం ఎక్కువగా తీసుకొచ్చి పెట్టుకుంటాం. వాటిని ఎక్కువ రోజులు తాజాగా, తేమ లేకుండా ఉండాలంటే అందులో కొద్దిగా ఉప్పు వేయండి. ఇందులోని సోడియం క్లోరైడ్ తేమని గ్రహిస్తుంది.



నిమ్మరసం ఎక్కువగా రావాలంటే.. నిమ్మరసం కొన్నిసార్లు గట్టిగా మారి ఎక్కువగా రసం రావు. అలాంటప్పుడు వాటిని 20 సెకన్ల పాటు మైక్రోవేవ్ చేయండి. దీని వల్ల రసం ఎక్కువగా వస్తుంది. మైక్రోవేవ్ లేకపోతే బాధపడాల్సిన అవసరం లేదు. గోరువెచ్చని నీటిలో కాసేపు నిమ్మకాయల్ని ఉంచండి. తర్వాత పిండితే రసం ఎక్కువగా వస్తుంది.

టమాటల్ని స్టోర్ చేయడం.. చాలా మంది టమాటల్ని ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తారు. కానీ, దీని వల్ల టమాటలు గట్టిగా మారిపోతాయి. అలా కాకుండా బయటే స్టోర్ చేయండి. ఒకవేళ ఫ్రిజ్‌లో పెట్టినా వండడానికి ఓ గంట ముందైనా తీసి నీటిలో వేయండి.

పాలలో మీగడ.. ఇక పాల నుంచి మీగడ రావట్లేదని చాలా మంది అనుకుంటారు. అందుకోసం పాలని బాగా మరిగించి వీటిని కాసేపు ఫ్రిజ్‌లో పెట్టండి. తర్వాత మీగడ మొత్తం పైకి వచ్చేస్తుంది. 2 గంటల తర్వాత చూడండి.

# మరణం అనంతరం "సమాజం కోసం జీవిస్తారు".

- ప్రయోగాలకు భౌతిక దేహాన్ని అప్పగించటం గొప్ప ఆదర్శం.
- వైద్య విద్యా, విజ్ఞాన పరీక్షల కోసం ఏచూరి భౌతిక దేహాన్ని అప్పగించటంతో చర్చ.
- నిజామాబాద్ జిల్లా అందుకు స్ఫూర్తిదాయకం.

**వేగుచుక్క న్యూస్, ప్రతినిధి,**

**-కుంచె వెంకటేష్:**

జీవించినతకాలం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడటం గొప్ప విషయం. కానీ మరణం అనంతరం కూడ వారి శరీరాలు భవిష్యత్తు అవసరాల కోసం , వైద్య విద్య ప్రయోగాలకు ఉపయోగ పడటం అంటే అంతకన్నా గొప్ప విషయం మరోటి లేదు. ఇటీవల సిపిఐ(ఎం) పార్టీ అఖిలభారత కార్యదర్శి, ఆదర్శ కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి న్యూమోనియా వ్యాధితో మరణించారు. ఏచూరి విద్యార్థి దశ నుండే విద్యార్థులు, ప్రజలు, సమాజం కోసం నిత్యం పోరాడారు. కాగా ఏచూరి భౌతిక దేహాన్ని వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించకుండా ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీ హాస్పిటల్ కు వైద్య విద్యా , విజ్ఞాన పరీక్షలకు అప్పగించారు. దీనితో మరణం అనంతరం కూడా ఏచూరి సమాజం కోసమే ఉపయోగ పడ్డాడు. అయితే దేశ వ్యాప్తంగా ఇదే అంశం పై చర్చ జరుగుతుంది. వామపక్ష పార్టీల ప్రధాన నాయకత్వం మరణించినప్పుడు వారి పార్థీవ దేహాలను ఆయా వైద్య కళాశాలలకు దానం చేస్తున్నారు. ముఖ్యంగా సిపిఐఎం పార్టీ అగ్ర నాయకత్వం జ్యోతిబాసు, బుద్ధదేవ్ భట్టా చార్య, పార్లమెంట్ స్పీకర్ సోమనాథ్ చటర్జీ, అనిల్ బిస్వాస్, బెనోయ్ చౌదరి తదితరులు ఉన్నారు. సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ భౌతిక దేహాన్ని కూడా ఆస్పత్రికి ఇచ్చారు. అలాగే ఎంతోమంది వామపక్ష నాయకుల పార్థివ దేహాలను వైద్య విద్య, పరీక్షల కోసం వైద్య కళాశాలలకు ఇవ్వడం
ఒక పద్ధతిగా జరుగుతుంది. ఏ మత ఆచారాలకు సంబంధం లేకుండా మరణం అనంతరం కూడ సమాజ కోసం జీవించడం అంటే ఇదేనేమో.

**వైద్య పరీక్షల కోసం పార్థీవ దేహాలు భిన్నమైన పద్ధతి .**

సాధారణంగా మనుషులు చనిపోయినప్పుడు ప్రధానంగా రెండు రకాల పద్ధతులు అనుసరిస్తున్నారు. ఒకటి దహన సంస్కారం రెండు మట్టిలో పూడ్చి పెట్టడం. ఈ రెండు పద్ధతులకు భిన్నమైనదే వైద్య పరీక్షల కోసం పార్థీవ దేహాలను వైద్య కళాశాలలకు అందించడం. పై రెండు పద్ధతులు, ఆచారాలు వల్ల మనకు గాని, సమాజానికి గాని ఉపయోగమేమీ లేదు. పైగా అవి మన జీవితంలో మరిచిపోదామన్నా మర్చిపోలేని చేదు జ్ఞాపకాలుగా ఎప్పుడూ మనలను వేధిస్తుంటుంది.అందుకే అవయవ దానం గాని, పూర్తి పార్థీవ దేహం దానం కానీ ఒక మంచి పద్ధతి. సమాజానికి ఉపయోగపడుతుంది. మరొకరికి ప్రాణం పోస్తుంది. మరణించిన తర్వాత కూడా ఆ వ్యక్తి అవయవ దానం వలన ఇతర మనుషులలో జీవించి ఉంటాడు. శరీరదానం వలన వైద్య విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రయోగాల కోసం ఆ వ్యక్తి దేహం ఉపయోగ పడుతుంది.



**నిజామాబాద్ జిల్లా ఆదర్శం.**

నిజామాబాద్ లో కమ్యూనిస్ట్ కుటుంబాలలో ఇదొక ఆచరణగా కొనసాగుతుంది. వామపక్ష వాది, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కే. ఎన్ రావు భౌతిక దేహాన్ని, వారి సతీమణి రత్నమాల, వారి పిల్లలు జర్నలిస్టు బాలేశ్వర్ రావు, సామాజిక కార్యకర్తలు విజయ భారతి, రాణి రుద్రమ లు తండ్రి కోరికను నెరవేరుస్తూ.. నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వారి పార్థివ దేహాన్ని అప్పజెప్పారు. అలాగే కొద్ది రోజులకే మరణించిన విజయ భారతి వైద్య విద్యార్థులకు పాఠమై తరలి వచ్చింది.

- జంపాల చంద్ర శేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్టు ఎక్జిక్యూటివ్ ట్రస్టీ కన్నెగంటి నరసింహారావు పార్థివ దేహాన్ని వారిసతీమణి వనజాక్షి , కుమారుడు కన్నెగంటి రవి కుమార్, కుమార్తెలు, రజనీ లక్ష్మీ, అరుణ జ్యోతి లు మెడికల్ కాలేజీకి అందించారు.
- సిపిఐ ఎం-ఎల్ న్యూ డెమోక్రసీ కేంద్రకమిటీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య సతీమణి స్నేహలత మరణానంతరం వేములపల్లి, వారి ఇద్దరు కూతుళ్లు, విజయరేఖ, అరుణరేఖ లూ అల్లుళ్ళు పివిటీఆర్ జవర్ బాబు, పరుచూరి శ్రీధర్ లు బంధువర్గం ఆగ్రహాన్ని సయితం పక్కకు పెట్టి వారి పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు విద్యార్థుల కు ప్రయోగాల కోసం అప్పజెప్పారు.
- సిపిఐ ఎం-ఎల్ న్యూ డెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఆకుల పాపయ్య తల్లి, ఆకుల చిన మల్లవ్వ, మెడికల్ విద్యార్థులకు పాఠమవ్వడానికి వికారాబాద్ మెడికల్ కళాశాల వరకూ పయనించింది! వారి అల్లుడు, మానవ హక్కుల వేదిక, నిజామాబాద్ యూనిట్ తొలి ప్రధాన కార్యదర్శి గడ్డం దయనంద్ కూడా తాను పాఠమవ్వడానికి వికారాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించారు.
- ఐఎఫ్ టియు నాయకుడు బచ్చు భూమయ్య జీవిత సహచరి మీరాబాయి, నిజామాబాద్ మెడికల్ కళాశాల విద్యార్థులకు పాఠమైంది.




- ప్రగతిశీల యువజన సంఘం నాయకుడు నీలం సాయిబాబా తల్లి, లక్ష్మీ, అక్క ఇందిర ల పార్టీవ దేహాలను బంధువుల ఆగహావేశాల మధ్య మెడికల్ కళాశాల కు అప్పజెప్పారు.
- పౌరహక్కుల సంఘం, సీఎల్సీ, జిల్లా కార్యదర్శి, అల్గోట్ రవీందర్ తండ్రి లింగయ్య కూడా మెడికల్ కళాశాల విద్యార్థులకు పాఠమయ్యారు.పౌరహక్కుల సంఘము, జిల్లా ఉపాధ్యక్షుడు, కొంగర శ్రీనివాసరావు కుమారుడు బంటీ కూడా మెడికల్ కాలేజీ కే తరలి వెళ్ళాడు.
- పౌరహక్కుల సంఘం జిల్లా యూనిట్ అధ్యక్షుడు మొవ్వా నాగేశ్వరరావు బ్రతికి ఉన్నప్పుడే తన కోరికను ఇద్దరు కుమారులకూ అప్ప చెప్పారు. వారి కోరిక ప్రకారం కుమారులు శరత్, సురేషులు వారి భార్యల, పిల్లల సమ్మతితో నిజామాబాద్ మెడికల్ కళాశాలకు వారి పార్థివ దేహాన్ని అప్పజెప్పారు.
- న్యూ డెమోక్రసీ నాయకులు, యువ న్యాయవాది పరుచూరి శ్రీధర్ నాన్న పరుచూరి కుటుంబరావు మరణించినప్పుడు వారి సతీమణి ఝాన్సీ ఆసుపత్రిలో ఉన్నప్పటికీ కొడుకులు శ్రీధర్, మురళీ లు వారి భార్యలు అరుణరేఖ, సౌజన్యలూ, కుమార్తె సంధ్య, వారి భర్త కుమార్ లు మెడికల్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ ని దృష్టి లో పెట్టుకుని కుటుంబరావు పార్థివ దేహాన్ని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పజెప్పారు.అందరి పార్థీవ దేహాలను మెడికల్ కాలేజీకి ఇవ్వబోయే ముందు వారి కళ్ళను ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. వామపక్ష వాదులే కాకుండా ప్రతి ఒక్కరూ మరణం అనంతరం తమ దేహాలు మట్టిలో కలిసి పోకుండా, సమాజానికి ఉపయోగ పడే విధంగా ఉద్యమంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది.



# ఎక్కువ బస్సులు కొంటేనే సాఫీ ప్రయాణం

హైదరాబాద్: కాలం చెల్లిపోవడం, ప్రయాణికుల ఓవర్‌లోడ్ సమస్యలతో బస్సులు రోడ్లపై ఆగిపోతున్న నేపథ్యంలో కొత్తవి కొనేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. గతంలో సగటున 65-67 మధ్య ఉన్న ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) ఇప్పుడు 100 శాతానికి పెరగడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2,457 కొత్తవి అవసరమని.. వాటికి రూ.905.23 కోట్లు కావాలని ఆర్టీసీ అంచనా వేసినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలను ఇటీవల జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్టీసీ నివేదించింది.

**సూపర్‌లగ్జరీ మినహా...**

సూపర్ లగ్జరీ మినహా మిగిలిన ఆరు రకాల సర్వీసుల్లో బస్సుల సమస్య, డిమాండ్ అధికంగా ఉంది. ముఖ్యంగా రాజధాని ఏసీ బస్సులు బాగా పాతవయ్యాయి. తరచూ మొరాయిస్తున్నాయి. మరమ్మతులు, ఇంధన ఖర్చు, కార్మికులపై పనిభారం పెరుగుతోంది. తిరిగిన కిలోమీటర్లు, జీవితకాలం ఆధారంగా పాతవాటిని మారుస్తుంటారు. ఒక ప్రాతిపదికలో 10, 12 లక్షల కి.మీ. తిరిగితే గతంలో తుక్కుగా మార్చే పరిస్థితి ఉండేది. ఇప్పుడు నిధుల సమస్యతో ఆర్టీసీ అలాంటివాటినీ నడిపిస్తోంది. రెండో ప్రాతిపదికలో 15 ఏళ్లు దాటితే విధిగా బస్సును తొలగించాలి. తుక్కుగా మార్చాల్సినవాటితో పాటుగా.. మహాలక్ష్మి పథకంతో భారీగా పెరిగిన రద్దీతో కొనుగోలు చేయాల్సిన బస్సుల సంఖ్య ఈసారి ఏకంగా రెండు వేలు దాటింది. 'ఆర్టీసీలో 2,200 బస్సుల్ని తుక్కుగా మార్చాల్సి ఉంది. 15, 20 లక్షల కిమీ దాటిన సర్వీసులనూ తిప్పుతున్నారు' అని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధానకార్యదర్శి వెంకన్న తెలిపారు. ఆర్టీసీలో సొంతవి, అద్దెవి కలిపి సుమారు తొమ్మిది వేల సర్వీసులు ఉన్నాయి. ఇందులో సొంతవి 6,424. సంస్థ గణాంకాల ప్రకారం వీటిలో 20 శాతం బస్సుల్ని మార్చాలి. కార్మికసంఘాలు మాత్రం తుక్కుగా మారిన బస్సులు 33శాతం పైనే అంటున్నాయి.

**'గ్రేటర్'లో అధిక సమస్య**

రీజియన్ల వారీగా చూస్తే హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లలో పాత బస్సుల సమస్య అధికంగా ఉంది. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో అత్యధికంగా డొక్కు బస్సులు ఉన్నాయి.

# జర్నలిస్టుల సమస్యలపై "పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్".





**రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**ఘనంగా కరీంనగర్ జిల్లా మహాసభ.**


**వేగుచుక్క న్యూస్,కరీంనగర్, సెప్టెంబర్ 15:**

సమాజంలో భాద్యత గల పౌరులుగా జర్నలిస్టులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. అదే సమయంలో జర్నలిస్టులపై జరిగే దాడులను ఐక్యంగా ఎదుర్కొంటూ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలోని ఎల్ ఐసీ ఏజెంట్స్ భవన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా నాల్గవ మహాసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ప్రత్యామ్నాయ యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూనే, జనం సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉండాలని అన్నారు. నిరంతర అధ్యయనం, ప్రజా సమస్యలపై కథనాలు అందిస్తూ సమాజంలో తమకంటూ స్థానం పొందాలని ఆయన సూచించారు.రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయని, గత ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశాయని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే కొత్త ప్రభుత్వానికి విన్నవించామని, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది మాసాలు గడిచినా పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, పెన్షన్ స్కీం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఫెడరేషన్ పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వంలో పదవులు పొంది పాలకులకు తలొగ్గుతూ జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తున్నాయని, పదవులు, పైరవీల కోసం జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తిచేసి హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ నివేదిక సమర్పించారు. మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిగ రఘు, కార్యదర్శులు రాజశేఖర్, బిక్షపతి, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుడుతాడి బాపురావు, యూసుఫ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్, మహేష్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్
నియోజకవర్గం ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రముఖ వైద్యులు బీ ఎన్ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

**- సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 15:**



నీటి పారుదల రంగంలో నిష్ణాతుడు, తన ప్రతిభానైపుణ్యాలు, ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధివైపు అడుగులు నడిపించిన నవభారత నిర్మాత, భారతీయ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాల సృష్టికర్త మోక్షగుండం విశ్వేశ్వరయ్య163వ జయంతి, ఇంజనీరింగ్ ల దినోత్సవాన్ని ఆదివారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలనూ వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ,
కర్ణాటక రాష్ట్రం, మైసూర్ దగ్గర ముడినేహల్లి అనే కుగ్రామంలో 1861లో జన్మించిన విశ్వేశ్వరయ్య అనేక కష్టనష్టాలతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసి అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం సంపాదించారని అన్నారు. దేశానికి రాబోయే రోజుల్లో వ్యవసాయం, పరిశ్రమలే అవసరమని గుర్తించి వృద్ధిలోకి తీసుకురావడం కోసం తీవ్రంగా శ్రమించారన్నారు. 101 సంవత్సరాల తన జీవితంలో దాదాపుగా 80 ఏళ్లు దేశం కోసం అహర్నిశలు పని చేశారన్నారు. హైదరాబాద్‌లో 1908లో మూసీ నదికి వరదలు ఉధృతమై అల్లకల్లోలమైన పరిస్థితుల్లో అనేక వంతెనలు నిర్మించి, మూసీ నదికే ముక్కుతాడు వేసిన గొప్ప మహనీయుడు విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. జీవితమంతా తన నైపుణ్యాన్ని దేశ నిర్మాణానికి వినియోగించి ఇంజనీర్ వృత్తికే వన్నె తెచ్చి, దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన దార్శనికుడు విశ్వేశ్వరయ్య అని అన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో వివిధ విభాగాల్లో పనిచేస్తోన్న యువ ఇంజనీర్లు నిత్యం సవాళ్ళను పరిష్కరిస్తూ, వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో తాగునీటి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో భారతదేశాన్ని సస్యశ్యామలం చెయ్యడంతో పాటు సమాజంలో ఉన్న సమస్యలకు ఇంజనీరింగ్ రంగం ద్వారా పరిష్కారం వెతికి విశ్వేశ్వరయ్య ఆశయాలు, కలలు సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.